
# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం 13 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4




పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

భోగి శుభాకాంక్షలు

- బలగం టీవీ

సీఈఓ బాలు కాయితీ


# విపక్ష నేతల అనుభవాన్ని ఉపయోగించుకుంటాం

- తాను ఎవరి సలహాలైనా స్వీకరిస్తాను
- తెలంగాణలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే..
- రాష్ట్ర అభివృద్ధికి అందరూ ముందుకు రావాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- చెన్నమనేని విద్యాసాగర్ పుస్తకావిష్కరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే ప్రతిపక్ష నేతల అనుభవాన్ని కూడా వినియోగించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో విద్యాసాగర్ రావు సేవలు ఎంతో అవసరమని కొనియాడారు. రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీకి వేదిక మీద నుంచి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు దేశంలోని అగ్రగామి నగరాల్లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని పార్టీల నేతలు కలిసి పని చేయాలి. మన పోటీ అమరావతితో కాదు, ప్రపంచ స్థాయి నగరాలతో ఉండాలి" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

విపక్ష నేతలు అయినా సరే, వారి అనుభవం అవసరం అనుకుంటే తప్పకుండా స్వీకరిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పలు రాష్ట్రాల్లో అధికార, విపక్షాలు అని తేడా లేకుండా అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాడుతున్నాయని అన్నారు. తనకు ఎటువంటి భేషజాలు ఉండవని, ఎవరి నుంచైనా సలహాలు తీసుకుంటానని స్పష్టం చేశారు. విద్యాసాగర్ రావు వంటి వ్యక్తుల అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరం అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందేలా పాటుపడుతున్నామని అన్నారు. మనం పోటీ పడాల్సింది అమరావతితో కాదని... ప్రపంచ నగరాలతో అని తమ వైఖరిని చాటిచెప్పారు. కేంద్రం చేయూత అందిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి పరిపూర్ణమవుతుందని... మెట్రో, ఆర్ఆర్ఆర్ అంశాల్లో సహకారం అందించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశానని రేవంత్ వెల్లడించారు.

తెలంగాణలో 60 శాతం ఆదాయం ఒక్క హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ దేశంలోని ఏ ఇతర నగరాలతో కాకుండా న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా నడవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన, కావలసిన నిధులను తెచ్చుకోవడంలో అందరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దాలంటే మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్ వంటి ప్రాజెక్టులు అవసరమని అన్నారు. హైదరాబాద్ మెట్రో దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గడిచిన పదేళ్లలో ఎలాంటి ప్రగతి లేని కారణంగా 9 వ స్థానానికి పడిపోయిందని, కేంద్ర మంత్రిమండలి రాబోయే సమావేశంలో మెట్రో విస్తరణకు ఆమోదముద్ర పడేలా నాయకులు చొరవ చూపాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిని ఇప్పుడు విస్మరిస్తే మరెప్పుడూ ముందుకుపోలేమని అన్నారు. దేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తయారు చేయడంలో తెలంగాణ వంతు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి గారికి చెప్పానని, ఆ సాధన దిశగా తెలంగాణలో అభివృద్ధి పనులకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణకు పోర్టు లేని కారణంగా డ్రైపోర్టుకు అనుమతి ఇవ్వాలని, అలాగే సమీపంలోని బందరు రేవుకు కనెక్టివిటీ ఉండాలన్న విషయాన్ని కూడా ప్రధాని దృష్టికి తెచ్చామన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని అంశాన్ని కూడా ప్రధాని సహకారం కోరామని, ఇలాంటి విషయాల్లో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు సహకరించాలని కోరారు. తమిళనాడులో రాజకీయంగా ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి సంబంధించిన అంశాల్లో సమిష్టిగా పనిచేస్తారని ఉదహరిస్తూ తెలంగాణ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి పోరాటాలు చేశారని గుర్తుచేస్తూ ప్రత్యేక రాష్ట్రంలో ఉన్నామంటే విద్యార్థులు రాజకీయాల్లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించడమేనని అన్నారు.



# ఎమ్మెల్యే సంజయ్ వర్సెస్ కౌశిక్‌రెడ్డి

- కరీంనగర్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సంజయ్, కౌశిక్‌రెడ్డి తోపులాట
- సంజయ్ కుమార్ ప్రసంగాన్ని అడ్డుకున్న కౌశిక్
- మంత్రుల ముందే బాహాబాహీకి దిగిన కౌశిక్ రెడ్డి, సంజయ్
- కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో మంత్రుల సమీక్ష రసాభాస

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యాచరణ సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య తోపులాట జరిగింది.

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రుల సమీక్షకరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఇతర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం చెప్పారు. సంజయ్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లారు. ఇదే అంశాన్ని కౌశిక్ రెడ్డి మంత్రుల సమీక్షలో ప్రస్తావించారు. నువ్వు ఏ పార్టీ తరపున గెలిచావు? ఆ తర్వాత ఏ పార్టీలోకి వెళ్లావు?... అసలు నీ పార్టీ ఏది? అంటూ కౌశిక్ రెడ్డి... సంజయ్ పై మండిపడ్డారు. దాంతో, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం నెలకొంది. ఇరువురు నేతలు పరుష పదజాలంతో దూషించుకున్నారు. ఒకరినొకరు నెట్టుకునే వరకు వెళ్లింది. దాంతో అక్కడున్న నేతలు కౌశిక్ రెడ్డిని నిలువరించారు. ఈ దశలో పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని సమీక్ష నుంచి బయటికి తీసుకెళ్లారు. మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలోనే రగడ జరిగింది.

ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూఇది హేయమైన చర్య అని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని, రాజకీయ దురుద్దేశంతోనే గొడవ పడ్డారన్నారు. పార్టీలకతీతంగా సమీక్ష సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరినీ ఆహ్వానించామని అన్నారు. సంజయ్ కుమార్ మాట్లాడేటప్పుడు కౌశిక్ రెడ్డి మైక్ లాక్కునే ప్రయత్నం చేసి దాడి చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. డైవర్షన్ కోసమే కౌశిక్ రెడ్డి హంగామా సృష్టించారని ఆరోపించారు. పోలీసులు బయటికి తరలించిన అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలని లేకపోతే ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటామని తెలియజేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




తెలుగు ప్రజలందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తెస్తుందని అన్నారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది తన సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# రైతులకు గుడ్ న్యూస్

## రైతుభరోసా మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రైతుభరోసా మార్గదర్శకాలను తెలంగాణ సర్కార్ విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ చేయనున్నారు. భూ భారతిలో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూములకే ఈ సాయం దక్కనున్నట్లు ప్రకటించింది. భూ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు అందించనున్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా ప్రభుత్వం సాయం అందించనుంది. సాగు యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫిర్యాదుల పరిష్కారం బాధ్యత కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



కాగా ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని వచ్చేనెల 15 నుంచి 28వ తేదీలోపు అమల్లోకి తీసుకొచ్చేలా విధివిధానాలు ఖరారు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మేధావులు, ఉద్యోగులు, రైతులు, పార్టీల నాయకుల అభిప్రాయాలను సేకరించి భూభారతి చట్టం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఏ చట్టం చేసినా కొన్ని నిబంధనలు ఉంటాయని, అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి'లోపభూయిష్టంగా ఉందని అన్నారు.

ప్రజాపాలన సభల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.15 కోట్ల దరఖాస్తులు వస్తే.. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 80.60 లక్షల దరఖాస్తులు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందులో అర్హులను గుర్తించేందుకు ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ మినహా సుమారు 72 లక్షల దరఖాస్తులపై సర్వే చేపట్టామని, ఈ పథకానికి సంబంధించిన అర్హులను ఈనెల 26న గ్రామసభల్లో నిర్ణయిస్తామని చెప్పారు. అదేరోజు రైతుభరోసాతో పాటు తెల్లరేషన్ కార్డుల ప్రక్రియ, భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. ఈ పథకాలకు అర్హుల గుర్తింపునకు ఈనెల 16 నుంచి కసరత్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

# మాజీ ఎంపీ మందా జగన్నాథం కన్నుమూత

- గత కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలు..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగర్ కర్నూలు మాజీ ఎంపీ మందా జగన్నాథం కన్నుమూశారు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మందా గత కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఇటిక్యాలలో 1951 మే 22న జన్మించారు. నాలుగు పర్యాయాలు ఎంపిగా సేవలందించారు. 1996, 1991, 2004, 2009లో ఎంపిగా గెలిచారు. మూడు సార్లు టిడిపి, ఒకటి సారి కాంగ్రెస్ తరపున ఎంపిగా గెలిచారు.

నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి 1996లో టిడిపి తరపున ఆయన ఎంపిగా గెలిచారు. 1999లో రెండవసారి 2004లో మూడవసారి, తిరిగి 15వ లోక్ సభకు 2009లో గెలుపొందారు. 2014లో టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. 2018లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా న్యూఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు. రెండో పర్యాయం 2019 వరకు అదే హోదాలో కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్లమెంట్ లో బిల్లు పెట్టిన సమయంలో ఆయన గట్టిగా సమర్థిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను చాటి చెప్పే విధంగా వ్యవహరించారు. నాగర్ కర్నూల్ ప్రాంతంతో ఆయనకు అవినాభావ సంబంధం ఉంది. మందా జగన్నాథం స్వగ్రామం గద్వాల నియోజకవర్గంలోని అలంపూర్. మందా జగన్నాథ్ మృతి పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి సంతాపం తెలపడంతో సానుభూతి ప్రకటించారు.



## సీఎం రేవంత్ రెడ్డి మూలాలు ఆర్ఎస్ఎస్ ఉన్నాయి : ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి మూలాలు ఆర్ఎస్ఎస్‌లో ఉన్నాయి. అందుకే మైనారిటీల పట్ల ముఖ్యమంత్రి వివక్ష చూపుతున్నట్లున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ..గాంధీల కుటుంబాన్ని చూసి మైనారిటీలు కాంగ్రెస్ కు ఓట్లు వేశారు . కానీ, ఇప్పుడు మైనారిటీల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ వమ్ము చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక మతకల్లోలాలు జరిగాయని ఆరోపించారు. మతకల్లోలాలను నిరోధించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని? ప్రశ్నించారు. గంగా జమునా తెహజీజ్‌లా ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని మండిపడ్డారు. మైనారిటీ డిక్లరేషన్ అమలు ఏమైంది? మైనారిటీ డిక్లరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. రూ.3000 వేల కోట్లు కేటాయించి కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాదీ ముబారక్ కింద రూ.1.6 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టారని విమర్శించారు. నిజామాబాద్‌లో తబ్లిఖీ జమాత్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అన్ని ఏర్పాట్లు చేయాలి. బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు.

## శబరిమలకు 'తిరువాభరణం' యాత్ర మొదలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్వామి అయ్యప్ప పవిత్ర ఆభరణాలు 'తిరువాభరణం' తీసుకువెళ్లే వార్షిక ఉత్సవ యాత్ర ఆదివారం పథనంథిట్టలోని పందలంలో ఒక ఆలయంలో నుంచి శబరిమలకు బయలుదేరింది. ఆ పవిత్ర ఆభరణాలను ఈ నెల 14న, 'మకరవిళక్కు' ఉత్సవం రోజు స్వామి అయ్యప్పకు అలంకరించనున్నారు. ట్రావన్‌కూర్ దేవస్వమ్ బోర్డ్ (టిడిబి) ప్రతినిధులతో పాటు అనేక మంది అయ్యప్ప భక్తులు కూడా 'తిరువాభరణం ఘోషాయాత్ర' వెంట శబరిమల ఆలయానికి సాగారు.

## జగన్నాథం మరణం బాధాకరం

### సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగర్‌కర్నూల్ లోక్‌సభ మాజీ సభ్యుడు మందా జగన్నాథం మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. లోక్ సభ సభ్యునిగా, సామాజిక, తెలంగాణ ఉద్యమకారుడిగా జగన్నాథం పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. వారి మరణం తెలంగాణకు తీరని లోటు అని పేర్కొన్నారు. జగన్నాథం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మందా జగన్నాథం మరణం పట్ల కేసీఆర్ సంతాపం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాజీ ఎంపీ, సీనియర్ రాజకీయ నాయకుడు మందా జగన్నాథం మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమ యంలో ఆయన పార్టీకి చేసిన కృషి, సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. మందా జగన్నాథం మృతితో తెలం గాణ ఓ సీనియర్ రాజకీయ నాయకుడిని కోల్పోయిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మందా జగన్నాథం మరణంతో శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి

**బలగం టీవీ, రాయ్‌పూర్**

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మరణించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా సిబ్బంది బృందం యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపడుతుండగా కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా భద్రతా బలగాలు (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డిస్ట్రిక్ట్ ఫోర్స్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. నలుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు పలు ఆయుధాలు, పేలుడుపదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు.

గతేడాది వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది ప్రారంభంలో 12 రోజుల వ్యవధిలో 12 మంది మావోయిస్టులను ప్రభుత్వం మట్టుబెట్టింది. దండకారణ్యంలో రక్తమోడుతున్న తీరుతో అడవిపుత్రుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.



## మార్చి 23 నుంచి ఐపీఎల్

- మే 25న ఫైనల్
- ప్రకటించిన బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఈ సీజన్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. మార్చి 23 నుంచి ప్రారంభం కానుందని, మే 25న ఫైనల్ మ్యాచ్‌తో ఈటోర్నీ ముస్తుందని తెలిపారు. త్వరలో పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని శుక్లా తెలిపారు. సుమారు 65 రోజుల పాటు సాగనుంది ఈ టోర్నీ. ముంబైలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. బిసిసిఐ సెక్రటరీగా కొత్తగా నియామితులైన దేవజిత్ సైకియా, ట్రెజరీ ప్రభ్‌తేజ్ ఈ సమావేశం పాల్గొన్నారు.

# 26 నుంచి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు





- మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి మంత్రి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 4 పథకాల ప్రారంభోత్సవానికి సంబంధించి సమీక్షా సమావేశం సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించారన్నారు. హైదరాబాద్‌కు సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక పథకాలు జీహెచ్ఎంసీ పరిధిలో లేనందున మిగతా రెండు పథకాలైన రేషన్ కార్డులు పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ఎంపిక చేయనున్నామన్నారు. ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సర్వే ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది జరిగేలా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.. సర్వే అనంతరమూ అధికారులకు సమాచారం ఇవ్వచ్చున్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారులతో సమావేశం జరిగింది. వారి సూచనలు పరిగణలోకి తీసుకొని అవసరమైతే ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 16-20వ తేది మధ్య ఫీల్డ్ వెరిఫికేషన్ జరుగుతుందనీ, ఫీల్డ్ వెరిఫికేషన్ తర్వాత వచ్చిన జాబితా జనవరి 20-24 మధ్య వార్డుల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తారన్నారు. 21-25 మధ్య డేటా ఎంట్రీ పూర్తిచేసి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు.

26 నుంచి కొత్త రేషన్ కార్డులు వస్తాయనీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ప్రకటన ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో స్వంత స్థలం ఉండి ఇండ్లు లేని వారికి 50 శాతం అప్లికేషన్‌లు వచ్చాయనీ, ఇంకా సర్వే పూర్తి చేసిన తర్వాత అర్హత గల లబ్దిదారుల జాబితా తెలుస్తుందన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 10 లక్షల 70 వేల 463 దరఖాస్తులు ప్రజాపాలనలో రాగా... అందులో 50 శాతం సర్వే చేయగా దాంట్లో ఇంటి స్థలం ఉన్నవారు 9,913 మంది ఉన్నారని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఇండ్లపై ఒక నిర్ణయం తీసుకుంటుందనీ, నగర ప్రజలకు ఎక్కడ అన్యాయం జరగనివ్వబోమన్నారు. మైగ్రేషన్ అయిన వారికి ఇండ్లు రేషన్ ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. జీరో టూ క్రైటీరియ ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఈ ప్రక్రియ జరుగుతుందని... ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం జరగాలని వారి సొంతింటి కల నిజం చేయాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సానుకూలంగా ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# 18న పాత వాహనాలు, వస్తువుల వేలం : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..

**బలగం టీవీ,. కరీంనగర్**



రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో స్వాధీనం చేసుకున్నా వాహనాలు, వివిధ ప్రాంతాలలో రోడ్లపై వదిలేవేయబడిన/గుర్తుతెలియని వాహనాలను,మరియు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సర్వీస్ లో లేని పలు వస్తువులు ఈనెల తేదీ 18-01-2025 రోజున ఉదయం సమయం 10:00 గంటలకు జిల్లా పరిధిలోని తాడూర్ లో గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న 54 వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లాలని తీసుకోకపోతే వేలం వేస్తామని గతంలో జులై నెలలో పత్రిక ప్రకటన ఇవ్వడం జరిగిందని ఆరు నెలలు గడిచినా వాహనాలను తీసుకెళ్లేందుకు రాకపోవడంతో మొత్తం వివిధ రకాల 54 వాహనాలలో 53 వాహనాలు స్క్రాప్ దశలో మరియు 01 వాహనం కండిషన్ దశలో ఉన్నాయని ఈవాహనాలను మరియు వివిధ పోలీస్ స్టేషన్లలో సర్వీస్ లో లేని పలు వస్తువులను తాడూర్ లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఈనెల తేదీ 18 వతేదీ రోజున వేలం వేయనున్నట్లు ప్రకటించారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి గల కొనుగోలుదారులు ఆధార్ కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో సహా హాజరు కావాలని వేలంపాటలో పాల్గనే వారు ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్స్ ఆర్.ఐ (MTO): 91 87126 56428 , సంప్రదించాలన్నారు.

# శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి వారి కళ్యాణ మహెూత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కు పూర్ణకుంభం,భాజ భజంత్రీలతో ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచన మండపంలో ప్రభుత్వ విప్ లు వేదో ఆశీర్వాదం అందజేశారు. వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఇక్కడికి వచ్చి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జర్నుతుందన్నారు. పురాతన ఆలయం మన ప్రాంతంలో ఉండటం మనకు ఎంతో పుణ్యఫలం అన్నారు.. ఆ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.



# ఆరు గ్యారంటీలు అమలు కాలేదు..



## ఏడో గ్యారంటీ పత్తా లేదు

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**బలగం టీవీ, హైదరాబాద్**

యాదాద్రి భువన గిరి బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ "స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుభాకాంక్షలు. ఈ రోజు కూడా బీ ఆర్ ఎస్ నేతల అరెస్టులు జరిగాయి ..వారిని వెంటనే విడుదల చేయాలి. రాష్ట్రం లో ఏడో గ్యారంటీ గా ప్రజాస్వామ్య పాలన ను అందిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదు .ఏడో గ్యారంటీ పత్తా లేదు రాష్ట్రం లో ప్రజాస్వామ్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఖూనీ చేస్తున్నారు. రేవంత్ కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా మారి పెత్తనం చెలాయిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డికి అధికారులు రాచ మర్యాదలు చేస్తున్నారు. లగచర్ల ఘటన తర్వాత వికారాబాద్ జిల్లా కలెక్టర్ తన కార్యాలయం నుంచి బయటకు వచ్చి మరీ స్వాగతం పలికారు. ఇంతకుముందు ఇలాంటిది ఎపుడైనా జరిగిందా ? తిరుపతి రెడ్డి కి ఏ పదవి ఉన్నదని కలెక్టర్ ప్రొటొకాల్ ను ఉల్లంఘించి మర్యాదలు చేస్తున్నారు. తిరుపతి రెడ్డి కి అధికారుల సమక్షం లో స్కూల్ విద్యార్థులను ఎండలో నిలబెట్టి మరీ స్వాగతం చెబుతున్నారు

..ప్రభుత్వ భవనాలకు తిరుపతి రెడ్డి ఏ హెూదా లో భూమి పూజలు చేస్తున్నారు ? కల్యాణ లక్ష్మి ,సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా అధికారుల సమక్షం లో తిరుపతి రెడ్డి పంచుతున్నారువార్డు మెంబర్ కూడా కానీ తిరుపతి రెడ్డి కి దక్కుతున్న ప్రొటో కాల్ ఏ సందేశం ఇస్తోంది ంపు రేపు తిరుపతి రెడ్డి పేరు ను శిలాఫలకాల మీద కూడా వేస్తారేమో. తిరుపతి రెడ్డి లగచర్ల లో భూ సేకరణకు బూతులు తిడుతూ రైతులను బెదిరించారు. కొండారెడ్డి పల్లి లో మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్యకు కారకుడైన తిరుపతి రెడ్డి పై ఎఫ్ ఐ ఆర్ ఎందుకు నమోదు కాలేదు. తిరుపతి రెడ్డి ఇపుడు వికారాబాద్ కు సీఎం అయ్యారు .దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న తిరుపతి రెడ్డి ఉన్న ఇల్లు ఎందుకు కూల్చరని హైడ్రా కమిషనర్ ను అడుగుతున్నా

అల్లు అర్జున్ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు అయినా తిరుపతి రెడ్డి పై ఎందుకు కాలేదు తిరుపతి రెడ్డి చర్యలను ప్రతిఘటించే స్థితి లో రేవంత్ రెడ్డి లేరా ? రేవంత్ రెడ్డి అనేక పోరులతో సతమతమవుతున్నారు

రేవంత్ రెడ్డి కి ఇంటి పోరు తో పాటు పాటు అధిష్టానం పోరు ,ఇక్కడి కాంగ్రెస్ నేతల పోరు ,మంత్రుల పోరు తదితరాలు ఉన్నాయి ఇన్ని సమస్యలతో సతమవుతున్న రేవంత్ రెడ్డి కి అసహనం రాకుండా ఎందుకు ఉంటుంది ? తన సమస్యల నుంచి ద్రుష్టి మళ్లించు కునేందుకు రేవంత్ రెడ్డి కే టీ ఆర్ పై తప్పుడు కేసు పెట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడం చేత కానీ రేవంత్ రెడ్డి కే టీ ఆర్ ను ఆరు సందర్భాలలో అరెస్టు చేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు ప్రెసెంట్ సిటీ ని వదిలేసి రేవంత్ ఫ్యూచర్ సిటీ మీద పడ్డారు మూసి హైడ్రా పేరిట ఇండ్లు కూల్చి వేస్తూ కొత్తగా కడుతామంటే రేవంత్ ను ఎలా నమ్ముతారు ? కేసీఆర్ ది కుటుంబ పాలన కాదు రేవంత్ రెడ్డి దే కుటుంబ పాలన అని ఆయన కుటుంబ సభ్యుల జోక్యాలు రుజువు చేస్తున్నాయి అలవి కాని హామీలు ఇచ్చి రేవంత్ మాట తప్పారుకాంగ్రెస్ నేతలు గ్రామాలకు వస్తే ప్రజలు నిలదీయాలి

రైతు భరోసా ను 15 వేలు ఇస్తామని 12 వేలకు కుదిస్తున్నారు రైతుకు కౌలు రైతుకు రేవంత్ కొట్లాట పెట్టారు కేవలం స్థానిక ఎన్నికలలో బయట పడేందుకు రేవంత్ హామీల అమలు పేరిట డ్రామాలు చేస్తున్నారు ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నేతలనే వేస్తున్నారు ఇందిరమ్మ ఇండ్లకు కావాలనే అందరి ఫోటో లు తీసుకుంటున్నారు వికారాబాద్ జిల్లా ను స్పీకర్ ప్రసాద్ కుమార్ కు అప్పగిస్తే సీఎం రేవంత్ కు వచ్చిన నష్టమేమిటి

.సీఎం ఎలా ఉండకూడదో రేవంత్ ఆలా ఉంటున్నాడు. బీ ఆర్ ఎస్ రేవంత్ అరాచకాల పై పోరాడుతూనే ఉంటుంది. బీ ఆర్ ఎస్ నేత పంజుగుల శ్రీశైల్ రెడ్డి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి వంద మంది కాంగ్రెస్ గుండాలను తయారు చేస్తున్నాడు .రాష్ట్రం లో అనుముల రాజ్యాంగం అమలవుతోంది. యాదాద్రి భువన గిరి బీ ఆర్ ఎస్ కార్యాలయం పై పోలీసుల సమక్షం లో కాంగ్రెస్ గుండాలు దాడి చేశారు. గుండాలను ఆపాల్సిన పోలీసులు వీడియో లు తీస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి గుండాలను ప్రోత్సహిస్తుంటే తిరుపతి రెడ్డి అరాచకాలు పెరగక ఏమవుతాయి ? వికారా బాద్ జిల్లా లో రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల అరాచకాలు ఎక్కువయ్యాయి బీ ఆర్ ఎస్ ప్రజల పక్షాన రేవంత్ అరాచకాలను ప్రశ్నిస్తూనే ఉంటుంది మేధావులు కూడా స్పందించాలి. కోదండరాం లగచర్ల విషయం లో ప్రేక్షక పాత్ర వహించడమేమిటి ? వివేకానందుడు ఇచ్చిన స్ఫూర్తి తో ఈ ప్రభుత్వం పై పోరాటానికి యువతను సమాయత్తం చేస్తాం" అని అన్నారు.



# కాలువకు గండి మన్నెంపల్లి జలదిగ్బంధం

**బలగం టీవీ,. కరీంనగర్**

కాలువకు గండిపడడంతో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామం జలదిగ్బంధమైంది. సిద్దిపేట జిల్లా తోటపల్లి రిజర్వాయర్ నుండి తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపేందుకు డి 4 కాలువ ద్వారా నీటిని తరలిస్తుండగా కాలువకు గండి పడడంతో మన్నెంపల్లి గ్రామంలోని కాలనీలు జలదిగ్బంధమయ్యాయి. అర్ధరాత్రి తర్వాత గ్రామంలోకి పెద్ద ఎత్తున నీరు రావడంతో ఎస్సీ కాలనీ ప్రజలు జాగారం చేసారు. గండి పడటంతో ఊరంతా వాగై పారుతుంది .ఇళ్లలోకి నీరు నిండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . గ్రామంలో ఇలా జరగడం నాలుగో సారని, ఇంత జరిగినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . ఇండ్లలోకి నీరు చేరడంతో సరుకులు, బియ్యం తో పాటు వస్తువులన్నీ నీటిలో మునిగిపోయాయని వాపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయంగా ఉంటున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే మరమ్మత్తులు చేయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.



# స్వామి వివేకానంద 163 వ జయంతి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో డి.వై.ఎస్.ఒ . ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే ను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు శాఖ అధికారి ఏ.రాందాస్ వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం డి.వై.ఎస్.ఒ. రాందాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని దేశానికి యువతకు ప్రపంచానికే ఒక మార్గదర్శకంగా రోల్ మాడల్ గా నిలిచాడు, ఈయన సందేశాలు ఇతని యొక్క నడవడి ప్రతి ఒక్క మానవాళికి ఆదర్శప్రాయం, అంతే కాకుండా ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి అని తెలియజేశాడు. మరియు ఈ కార్యక్రమంలో యువజన మరియు క్రీడల శాఖ సిబ్బంది,వాలీబాల్ అకాడమీ కోచ్ లు,మరియు అకాడమీ విద్యార్థులు మరియు అసోసియేషన్ సభ్యులు,యువత పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



# నిరుపేద వివాహ కుటుంబానికి చేయూతనిచ్చిన కౌన్సిలర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్ సిక్కువాడకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బల్విర్ సింగ్ -ఇంద్రా కౌర్ ల కూతురు అంజలి వివాహం సందర్భంగా ఈ రోజు స్థానిక 36 వ వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు 50 కిలోల బియ్యం అందించి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వధువు బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ కల్లూరి రాజు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్, ఎర్రం (బస్సు) మల్లయ్య, కొక్కుల నర్సయ్య,ఆడెపు విఠల్, బొప్ప లింగం,కోడూరి మల్లేశం,నంగునూరి శ్రీనివాస్,వధువు బంధువులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పేట మండలంలోని శ్రీ వేణు గోపాల స్వామి వారి దేవస్థానంలో..



## ఐక్యత తోనే ముదిరాజులకు రాజ్యాధికారం

### రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో ముదిరాజులు సత్తా చాటాలి

### ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

ఐక్యతతోనే ముదిరాజులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు అన్నారు, ఆదివారం గజ సింగవరం గ్రామంలో ముదిరాజ్ చైతన్య సభ జరిగింది. ఈ సమావేశానికి గజ సింగవరం ముదిరాజ్ సంఘ అధ్యక్షులు రాయలింగు వెంకటి, బోయిని నరసయ్య, జజ్జరి శంకర్ లు సంయుక్తంగా అధ్యక్ష వహించగా మండల శాఖ అధ్యక్షుడు శాస్త్ర బోయిన లక్ష్మణ్ సమన్వయ పరిచారు, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలలో ముదిరాజులు ఐక్యతగా ఉండి వార్డు మెంబర్ నుండి మొదలు జడ్పిటిసి వరకు సత్తా చాటాలన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన ముదిరాజు లను బీసీడీ నుంచి బీసీ ఏ మార్చుతామని ఇచ్చిన మాటను అమలు చేయాలని పర్శ హన్మాండ్లు డిమాండ్ చేశారు, ముదిరాజ్ సంఘం జిల్లా ఎన్నికలలో గంభీరావుపేట మండలం ఏకతాటిపై కచ్చి అనుకున్న వ్యక్తిని జిల్లా అధ్యక్షులు గా గెలిపించుకున్నారని అదే విధంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా శివంది దేవేందర్ ను జిల్లా కార్యదర్శి పెరిమెల్లి రమేష్ లను ఎన్నుకోవడం హర్షనీయమన్నారు ,ఇద్దరూ జిల్లా పదవులకు ఎన్నుకోవడం పట్ల వారికి పర్ష హన్మాండ్లు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు, గజ సింగవరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా ఉపాధ్యక్షుడు కార్యదర్శిలను శాలువాలు పూలదండ లతో ఘనంగా సన్మానించారు ,ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి పిట్ల బాబు , నాయకులు రాయలింగు వెంకటయ్య,బోయిని నర్సయ్య,జజ్జరి శంకర్,క్యాషియర్ తోకల దేవదాసు ,ఉపాధ్యక్షులు ఆనందం ,నాయకులు అరిగె రమేష్ ,నారాయణ ,జజ్జరి రమేష్,శంకర్ ,మహేష్ ,కొమురయ్య ,దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు

- **ఎంపీ వద్దిరాజు**



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

సంక్రాంతి పండుగ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలుగు ప్రజలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భోగి, మకర సంక్రాంతి,కనుమ పండుగల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాసులు,దేశంలోని వివిధ రాష్ట్రాలు,విదేశాలలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు వారందరికి ఎంపీ రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. భోగి మంటలు వేసేటప్పుడు,పతంగులు ఎగరేసే సందర్భాలలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర యువతకు హితవు పలికారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవలసిందిగా ఎంపీ వద్దిరాజు తెలుగు వారందరిని కోరారు.




## పూర్వ విద్యార్థుల ఆత్మీయులు ఆత్మీయ సమ్మేళనం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విజ్ఞాన వర్ధిని హై స్కూల్ 2000 – 2001 ఎస్ఎస్సి బ్యాచ్ ఎస్ఎస్సి విద్యార్థులు రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విజ్ఞాన వర్ధిని హై స్కూల్ కరస్పాండెంట్ మందాడి భాస్కర్ రెడ్డి మరియు అప్పటి ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. విద్యకు ఉన్న అవకాశాలను ఏ విధంగా అందిపుచ్చుకోవాలో ఉపాధ్యాయులు తెలియజేయడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులు అత్యున్నత స్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని, ఇలాగే రానున్న తరానికి ఆదర్శవంతం కావాలని స్నేహానికి ఉన్న విలువలను ఇట్టి కార్యక్రమంతో మరింత బలపడతాయనీ విద్యార్థిని విద్యార్థులు మరింతగా ముందుకు వెళ్లాలని కార్యక్రమంలో చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని పోకల కిరణ్, రాంబాబు, మోర శ్రీహరి, భాను,

# 1000 మంది.. 358 రంగవల్లులు..



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అత్యధిక రంగవల్లికలను రూపొందించిన కార్యక్రమం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. టీం 39 ఆధ్వర్యంలో ఎస్సార్ ఇంటర్నెట్ అధినేత, సామాజిక సేవకులు పాసికంటి లవన్ కుమార్, మిత్ర బృందం ఏర్పాటు చేసిన రంగవల్లికల పోటీలలో సిరిసిల్ల పట్టణంలోని కార్మిక క్షేత్రమైన బివై నగర్ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలంతా తమ గృహాలను అందంగా అలంకరించుకునే నేపథ్యంతో రంగవల్లికల పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు లవన్ కుమార్ తెలిపారు.

బి వై నగర్ లోని 31 వ వార్డు పరిధిలో గల ఏడు రోడ్ల వరుసలలో మహిళలు తమ ఇళ్ల ఎదుట అందంగా ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. సుమారు 1000 మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీలలో 358 ముగ్గులు వేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా మహిళా డాక్టర్లు పులి ప్రియాంక, స్నేహ, ఆకాంక్ష వ్యవహరించారు. ముగ్గుల అలంకరణ మధ్యాహ్నం వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి వార్డులోని ప్రధాన కూడలిలో స్టేజి ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.





కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులచే పాటలు, నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం మిమిక్రీ ఆర్టిస్ట్ ప్రముఖుల గొంతులను అనుకరిస్తూ స్థానికులను అలరించారు. ముగ్గులు వేసి వాటిని రంగులతో అలంకరించడంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన మహిళలు పది మందికి మొదటి బహుమతిగా 10 డ్రెస్సింగ్ టేబుల్లు, రెండో బహుమతి గెలుచుకున్న పదిమంది మహిళలకు 10 మిక్సర్ గ్రైండర్లు ,ప్రత్యేక విభాగంలో పరిగణలోకి తీసుకున్న 18 మంది మహిళలకు ఐదు లీటర్ల ప్రెషర్ కుక్కర్ లను లవన్ కుమార్ అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న 358 మంది మహిళలకు స్టీల్ పాత్రలను అందజేశారు.

## కాటిరేవుల(ఎడ్ల పండగ) మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



వేములవాడ పట్టణంలోని లక్ష్మీపురంలో శ్రీ రాజరాజేశ్వర రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాటిరేవుల మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న కాటిరేవుల పండగను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రైతులు ఎడ్లను పశుసంపదను తమ ఆస్తిగా భావిస్తారని తెలిపారు. వ్యవసాయానికి సహాయం చేసే ఎడ్లను దైవంగా భావించి నేడు వాటికి ప్రత్యేక పూజలు చేస్తారని అన్నారు.




## సహస్ర జూనియర్ కళాశాల 5వ వారికోత్సవ సంబురాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్థానిక సిరిసిల్ల ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సహస్ర జూనియర్ కళాశాల 5వ వార్షికోత్సవం “సహస్ర ప్రగ్యాన్ 2025” పేరిట ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంధ్బర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ సిద్దిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ, విజయాలు మనకు స్థైర్యాన్ని ఇస్తే అపజయాలు మనకు అనుభవాలని నేర్పిస్తాయని, మరియు వాటి స్ఫూర్తి తో ప్రయత్నాన్ని ఆపకుండా మరింత ఉత్సాహంగా విజయాలని సాధించాలని, ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ చూపరులను ఆకర్షించింది. ఈ సమావేశం లో ప్రిన్సిపాల్ సిద్ధిరాల శ్రీనివాస్, డైరెక్టర్ లు నరేష్ కుమార్, రాజు, పవన్ కుమార్, కుమారస్వామి, అధ్యాపక బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## మంత్రి పొంగులేటి కారుకు ప్రమాదం

**బలగం టీవీ, వరంగల్**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా.. తిరుమలాయపాలెం వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పేలిపోయాయి. కారు డ్రైవర్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో మంత్రి పొంగులేటితో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, డీసీసీబీ డైరెక్టర్లు బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య ఉన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మంత్రి తన ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మం చేరుకున్నారు.



## సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సంక్రాంతి పండుగ సందర్భంగా 32 వ వార్డ్ లో వార్డ్ కౌన్సిలర్ సీమ బేగం–అక్రమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ జిందం కళా–చక్రపాణి, డాక్టర్ శోభారాణి, సింగర్ శిరీష హాజరై విజేతలకు బహుమతులు అందించారు.

మొదటి బహుమతి. మిక్సర్ గ్రండర్

పయ్యావుల సింధూ.

రెండవ బహుమతి.. రైస్ కుక్కర్.

ఏనుగుల పావని.

మూడవ బహుమతి..డిన్నర్ సెట్..

చేరాల లావణ్య. 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అలాగే పోటీలో పాల్గొన్న 45 మందికి బహుమతులు అందజేయడం జరిగింది. అలాగే ఇటీవల ప్రకటించిన గ్రూప్4 ఫలితాలలో ఉద్యోగం సాధించిన సింధుని సన్మానించి సత్కరించారు.. ఇట్టి కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సయ్యద్ తస్లీమ్, కౌన్సిలర్లు గడ్డం లత,దార్ణం అరుణ, కొండ అనూష, చేరాల స్వాతి, గోసికే అనిల్, బేతి కరుణాకర్, సికిందర్, ఆఫ్రోజ్, %వాఎ%. అంజాద్, గణేష్, మసూద్, పవన్, కమల్, మదు, వార్డ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు

- పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారీ స్కోరు సాధించిన టీమిండియా
- ఐర్లాండ్‌పై ఘన విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మహిళల క్రికెట్ జట్టు వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసింది. తాజాగా జరిగిన మ్యాచ్ లో అత్యధిక స్కోర్ ను నమోదు చేసింది. ఐర్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో ఆదివారం జరిగిన రెండో వన్డేలో తలపడ్డారు భారత అమ్మాయిలు అత్యంత భారీ స్కోర్ చేశారు. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 370 పరుగులు చేశారు.

ఐర్లాండ్‌తో జరిగిన వన్డేలో కెప్టెన్ స్మృతి మంధాన టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. మంధాన, ప్రతీక జోడి టీమిండియాకు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. ఇద్దరు కలిసి తొలి వికెట్‌కు 156 పరుగులు జోడించారు. మంధాన 54 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 73 పరుగులు, ప్రతీక 61 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 67 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆ తర్వాత హర్లీన్ డియోల్ కూడా అర్ధ సెంచరీ చేసింది. ఆమె 84 బంతుల్లో 12 ఫోర్లతో 89 పరుగులు చేసింది. జెమీమా 91 బంతుల్లో 12 ఫోర్లతో 102 పరుగులు చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మహిళల వన్డేలో జెమీమాకు ఇది తొలి సెంచరీ. రిచా ఘోష్ ఐదు బంతుల్లో 10 పరుగులు చేసి అవుట్ అయ్యింది. తేజల్ హసబ్నిస్, సయాలి సత్ఘారే చెరో రెండు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఐర్లాండ్ తరపున ఓర్లా ప్రెండర్‌గాస్ట్, అర్లీన్ కెల్లీ చెరో రెండు వికెట్లు, జార్జినా డెంప్సేకు ఒక వికెట్ దక్కింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్ జట్టు 7 వికెట్లు నష్టానికి కేవలం 254 పరుగులకే పరిమితమైంది. దాంతో భారత్ 116 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.



# బీసీసీఐ కార్యదర్శిగా దేవ్‌జిత్ సైకియా నియామకం

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీసీఐ కొత్త కార్యదర్శిగా మాజీ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ దేవ్‌జిత్ సైకియా నియామకమయ్యారు. ఐసీసీ అధ్యక్షుడిగా జై షా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో సైకియా ఎన్నికయ్యారు. సైకియాను కార్యదర్శిగా ఎన్నుకోవాలని బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సైకియా ప్రస్తుతం తాత్కాలిక కార్యదర్శిగా పని చేస్తున్నారు. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం.. ఏదైనా ఖాళీని భర్తీ చేసేందుకు రోజుల్లోగా ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి.. నియామక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. జై షా డిసెంబర్ 1, 2024న ఐసీసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. బీసీసీఐ కార్యదర్శి పదవి ఖాళీ అయిన 43వ రోజున బీసీసీఐ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

దేవ్‌జిత్ సైకియా టీమిండియా మాజీ క్రికెటర్. ఆయన 1990 నుంచి 1991 వరకు నాలుగు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. చాలా తక్కువ సమయం క్రికెట్ ఆడారు. ఆయన కెరీర్‌లో మొత్తం 53 పరుగులు చేసి.. తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. క్రికెట్ తర్వాత న్యాయవాద వృత్తిలో చేరారు. 28 సంవత్సరాల వయసులో గౌహతి హైకోర్టులో న్యాయవాదిగా చేరారు. అదే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉత్తర రైల్వేలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం పొందాడు. సైకియా క్రికెట్ పరిపాలనలో కెరీర్ 2016లో ప్రారంభమైంది. ఆయన అసోం క్రికెట్ అసోసియేషన్ ఆరుగురు ఉపాధ్యక్షుల్లో ఒకరు. అసోసియేషన్‌కు ప్రస్తుతం అసోం ముఖ్యమంత్రిగా ఉన్న హిమంత బిస్వా శర్మ నాయకత్వం వహించారు. సైకియా 2019లో ఏసీఏ కార్యదర్శి కాగా.. 2022లో బీసీసీఐ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

# డాకు మహారాజ్‌కు ప్రీక్వెల్ తీసే ఆలోచన ఉంది

- నిర్మాత నాగవంశీ



**బలగం టీవీ, హైదరాబాద్**

'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలైంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో 'డాకు మహారాజ్' సినిమాకి వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం.. అభిమానులకు, ప్రేక్షకులను కృతజ్ఞతలు తెలిపింది. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, 2023 సంక్రాంతి వాల్తేరు వీరయ్యతో విజయాన్ని అందుకున్నాను. ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్'తో వచ్చాను. సంక్రాంతి అనేది నాకు మరింత ప్రత్యేకమైన పండుగలా మారిపోయింది. తమన్ కావచ్చు, విజయ్ కార్తీక్ కావచ్చు.. అద్భుతమైన టీమ్ వల్లే ఈ అవుట్ పుట్ వచ్చిందని చెప్పవచ్చన్నారు. ఇక నిర్మాత నాగవంశీకి 'డాకు మహారాజ్ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారా?' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి నాగవంశీ జవాబిచ్చారు. 'సీక్వెల్ కాదు, ప్రీక్వెల్ ప్లాన్ చేస్తున్నాం. సినిమాలో గుర్రంపై చూపిన ఓ సీన్‌ను బేస్ పాయింట్ చేసుకొని ప్రీక్వెల్ తీసేందుకు ప్రయత్నిస్తాం' అని అన్నారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 14 ఏండ్ల ముంబయి బ్యాటర్ విధ్వంసం..

- 157 బంతుల్లో ట్రిపుల్ సెంచరీ చేసిన ఇరా జాదవ్

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత అండర్-19లో 14 సంవత్సరాల ముంబయి బ్యాట్స్ వుమెన్ ఇరా జాదవ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ట్రిపుల్ సెంచరీ సాధించింది. బెంగళూరు వేదికగా ముంబయి-మేఘాలయ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆమె కేవలం 157 బంతుల్లో 346 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఇరా 16 సిక్సర్లు, 42 ఫోర్ల సహాయంతో ప్రత్యర్థులకు వణుకు పుట్టించింది. వైట్ బాల్ క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ సాధించిన తొలి భారతీయ మహిళా బ్యాటర్‌గా ఇరా జాదవ్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇదే అండర్-19 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాట్స్ వుమెన్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన లిజెల్లే లీ పేరిట ఉన్నది. 2020లో కీపై అజేయంగా 427 పరుగులు చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల జరిగిన వుమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలం ఇరా జాదవ్ అన్‌సోల్డ్ ప్లేయర్‌గా నిలిచింది.

మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో ఇరా జాదవ్‌తో కలిసి కెప్టెర్ హర్లీ గాలాతో కలిసి 79 బంతుల్లో 116 పరుగులు చేసింది. ఇద్దరు కలిసి రెండో వికెట్ 274 పరుగులు చేశాడు. వీరిద్దరి భాగస్వామ్యంలో 71 బంతుల్లో జాదవ్ 149 పరుగులు చేయడం విశేషం. ఆ తర్వాత దీక్షా పవార్‌తో కలిసి 186 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరి పార్టనర్‌షిప్‌లో 50 బంతుల్లో 137 పరుగులు చేసింది. మేఘాలయ ముగ్గురు బౌలర్లలో వంద.. అంతకంటే ఎక్కువ పరుగులు ఇవ్వడం విశేషం. ఈ మ్యాచ్‌లో ముంబయి మొత్తం 536 పరుగులు చేసింది. ఆ తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన మేఘాలయ కేవలం 19 పరుగులకే కుప్పకూలింది. మేఘాలయ ఇన్నింగ్స్‌లో ఎవరూ రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. ముంబయి బౌలర్లలో జియా, యయాతి మూడు వికెట్ల చొప్పున, రితికా, అక్షయ తలో రెండు వికెట్లు తీశారు.

# లాస్ ఏంజెల్స్ కార్చిచ్చులో నటి ప్రీతి జింటా..

**బలగం టీవీ, హైదరాబాద్**

లాస్ ఏంజెల్స్ లో ఏర్పడిన కార్చిచ్చులో బాలీవుడ్ స్టార్ నటి ప్రీతి జింటా చిక్కుకున్నారు. అక్కడి పరిస్థితులను వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'చుట్టూ జరుగుతోన్న విధ్వంసం చూసి భయాందోళనకు గురయ్యాం. చిన్న పిల్లలు, వృద్ధులతో చాలా మంది పొరుగువారు ఇళ్లను వదిలి వెళ్లిపోయారు. ఇవన్నీ చూసి నేను హృదయవిదారకంగా ఉన్నా. మమ్మల్ని సురక్షితంగా ఉంచినందుకు దేవుడికి, అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.

# సందీప్ కిషన్ 'మజాకా' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మాణంలో త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో మజాకా సినిమా తెరకెక్కుతంది. ఈ సినిమాకి స్టార్ రైటర్ ప్రసన్న బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. ఈ సినిమాతో మన్మధుడు హీరోయిన్ అన్ను అంబానీ రీ ఎంట్రీ ఇస్తుంది. అలాగే రీతూ వర్మ కూడా ఇందులో హీరోయిన్ గా నటిస్తుంది. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు.

ఇక టీజర్ చూస్తుంటే.. సందీప్ కిషన్, రావు రమేష్ ఇద్దరు తండ్రి కొడుకులుగా నటిస్తున్నారు. సందీప్ కిషన్ రీతూ వర్మ పాత్రతో ప్రేమలో పడితే, రావు రమేష్ అన్ను అంబానీ పాత్రతో ప్రేమలో పడినట్టు, తండ్రి కొడుకులు ఇద్దరూ ప్రేమలో పడినట్టు, పెళ్లి సమయంలో ఏదో ఇబ్బంది వచ్చినట్టు ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ గా చూపించారు.

# 'గేమ్ ఛేంజర్' సినిమాలో 'నానా హైరానా' సాంగ్..

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గేమ్ ఛేంజర్ త్రం జనవరి 10న వరల్డ్ వైడ్ రిలీజైంది. కాగా ఆదివారం నుంచి ఈ చిత్రంలో 'నానా హైరానా' సాంగ్ ను కూడా జోడిస్తున్నట్టు చిత్రబృందం ఓ ప్రకటనలో వెల్లడించింది. రిలీజ్ వెర్షన్ లో ఈ సాంగ్ లేదు. "మెలోడీ ఆఫ్ ద ఇయర్ అనదగ్గ 'నానా హైరానా' సాంగ్ ను గేమ్ చేంజర్ సినిమాలో చూడొచ్చు... మీకు దగ్గరలో ఉన్న థియేటర్లలో కుటుంబ సమేతంగా గేమ్ చేంజర్ ను చూడండి" అంటూ చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పోస్ట్ చేసింది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించాడు.

# రేసింగ్ ఈవెంట్‌లో అజిత్ కు 3వ స్థానం

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ అగ్ర హీరో అజిత్ కుమార్ బైక్ రేసర్ అని తెలిసిందే. తాజాగా ఆయన దుబాయ్ 24హెచ్ కార్ రేసింగ్ ఈవెంట్లో మూడో స్థానంలో నిలిచారు. అజిత్ టీమ్ ఈ రేసులో జీటీ4 కేటగిరీలో పోటీపడింది. రేసు ముగిసిన వెంటనే అజిత్ భారత జాతీయ పతాకం చేతబూని సర్క్యూట్ లో కలియదిరిగారు. జెండా ఊపుతూ తన ఆనందోత్సాహాలను ప్రదర్శించారు. కాగా, అజిత్ దుబాయ్ కార్ రేసులో పతకం సాధించడంతో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. టాలీవుడ్ యువ హీరో అక్కినేని నాగచైతన్య కూడా అజిత్ సాధించిన విజయం పట్ల స్పందించారు. "అజిత్ సార్... అదరగొట్టారు మీరు! ఏం జర్నీ, ఏం విజయం! మమ్మల్నిందరినీ గర్వించేలా చేసినందుకు మీకు శుభాభినందనలు" అంటూ పేర్కొన్నారు.

# నటుడు వెంకటేశ్ కుటుంబంపై కేసు నమోదు..

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు వెంకటేశ్‌కుటుంబసభ్యుల పై కేసు నమోదైంది. ఫిల్మ్ నగర్‌లోని దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత ఘటనలో దగ్గుబాటి సురేశ్‌బాబు, వెంకటేశ్, రానా, అభిరామ్‌పై 448, 452, 458, 120బి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నందకుమార్ అనే వ్యక్తికి చెందిన దక్కిన్ కిచెన్ హోటల్ అంశంలో దగ్గుబాటి ఫ్యామిలీతో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో నందకుమార్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. 2022 నవంబర్‌లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బౌన్సర్లతో కలిసి హోటల్‌ను పాక్షికంగా ధ్వంసం చేశారు. అయితే ఈ స్థలంలో ఎలాంటి చర్యలు చేపట్టొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కానీ కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా 2024 జనవరిలో దగ్గుబాటి ఫ్యామిలీ హోటల్‌ను పూర్తిగా కూల్చివేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేయాలని కోరుతూ నందకుమార్ మళ్లీ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కాగా ఈ కేసులో దగ్గుబాటి ఫ్యామిలీపై కేసు నమోదు చేసి విచారణ చేయాలంటే నాంపల్లి కోర్టు ఫిలింనగర్ పోలీసులను తాజాగా ఆదేశించింది. ఈ వ్యవహారంలో సురేశ్ బాబు (ఏ1) గా, వెంకటేశ్ (ఏ2)గా, రానా (ఏ3) , అభిరామ్ (ఏ4)గా నిర్ధారించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది.